Andhra Jyothy Dt- 19/11/17.



మూడు భారీ ట్రైలర్స్‌పై రోడ్డు మార్గంలో వస్తున్న మెట్రో కోచ్‌లు (ఫైల్)

# కొరియా టు హైదరాబాద్

- జల, రోడ్డు మార్గంలో నగరానికి మెట్రో కోచ్‌లు
- 2014 ఆగస్టు 8న మొట్ట మొదటి టెస్ట్ రన్
- మూడేళ్లుగా టెస్ట్, ట్రయల్ రన్స్‌కే పరిమితం
- నవంబర్ 28 నుంచి జాతికి అంకితం

హైదరాబాద్ సిటీ, నవంబర్ 18 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ మహానగర నడి రోడ్లపై ఉన్న ఒంటి స్తంభాలపై ఎలాంటి ఆటంకాలు లేకుండా మెట్రో రైళ్లు దూసుకుపోతున్నాయి. ఆకాశమార్గంలో పరుగులు పెడుతూ నగరవాసులను అమితంగా ఆకర్షిస్తున్నాయి. రెప్పపాటులో దూసుకెళుతున్న ఆ మెట్రో రైళ్ల కోచ్‌లు కొరియా నుంచి నగరానికి రావడానికి 28 రోజులు పట్టింది. సముద్ర, రోడ్డు మార్గాల మీద రోజుల తరబడి ప్రయాణించి నగరంలోని ఉప్పల్, మియాపూర్ మెట్రో డిపోలకు చేరుకున్నాయి. 2014 ఏప్రిల్ 25న కొరియాలోని చాంగ్‌వాన్ ఫ్యాక్టరీ నుంచి హ్యూందాయ్ రొటెం కంపెనీ మూడు సెట్ల మెట్రో కోచ్‌లను హైదరాబాద్‌కు పంపింది. కొరియాలోని మాసన్ పోర్టు నుంచి సముద్ర మార్గంలో నౌకలో చెన్నైకి పంపించారు. ఆ నౌక మే 9, 2014న చెన్నై పోర్టుకు చేరుకుంది. అక్కడి నుంచి మొట్ట మొదటి మెట్రో కోచ్‌లను మే 11న హైదరాబాద్‌కు రోడ్డు మార్గంలో పంపించారు. అలా మూడు వేర్వేరు ట్రైలర్ వాహనాల ద్వారా మెట్రో కోచ్‌లు 21 మే 2014న ఉప్పల్ డిపోకు చేరుకున్నాయి. ఎల్ అండ్ టీ సంస్థ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ ఎస్.ఎన్.సుబ్రమణ్యంతో పాటు హైదరాబాద్ మెట్రో రైలు ఎండీ ఎన్వీఎస్ రెడ్డిలు మెట్రో కోచ్‌లను ప్రత్యేకంగా పరిశీలించారు. ఇప్పటి వరకు మొత్తం 57 కోచ్‌లు నగరానికి గతేడాదిలోనే చేరుకున్నాయి. ఆగస్టు 8న మెట్రో కారిడార్‌లోని వయా డక్ట్‌లపై మొదటి సారిగా టెస్ట్ రన్‌లను, ఆతర్వాత వరుసగా ట్రయల్ రన్స్‌ను నిర్వహించారు. అలా మూడేళ్లుగా పరుగులు పెట్టిన మెట్రో రైళ్లను ఈ నెల 28న జాతికి అంకితం చేయనున్నారు.



ఉప్పల్ డిపోకు చేరుకున్న మెట్రో మొట్టమొదటి కోచ్ (ఫైల్)

## మెట్రో రైలు నిర్వహణ బాధ్యతలు 2012లోనే కియోలిస్‌కు

- ఫ్రాన్స్ కంపెనీతో ఒప్పందం కుదుర్చుకున్న ఎల్ అండ్ టీ

హైదరాబాద్ సిటీ, నవంబర్ 18 (ఆంధ్రజ్యోతి): ప్రపంచంలోనే అత్యంత ప్రతిష్ఠాత్మకంగా భావిస్తున్న మెట్రోరైలు ప్రాజెక్టును దేశీయ కంపెనీ అయిన ఎల్ అండ్ టీ నిర్మిస్తోంది. కాగా.. నిర్మాణ పనులన్నీ పూర్తయిన తర్వాత 35 ఏళ్ల పాటు మెట్రో రైళ్లను నడపడం, అన్ని రకాల బాధ్యతలను నిర్వహించడం మొత్తం ఫ్రాన్స్‌కు చెందిన కియోలిస్ కంపెనీ చేపడుతుంది. దీనికి సంబంధించిన ఒప్పందం 2012 మేలోనే ఎల్ అండ్ టీ కంపెనీ కుదుర్చుకుంది. ప్రపంచంలోని 15 దేశాల్లో మెట్రో రైళ్లతో పాటు ఇతర ప్రజా వ్యవస్థలను సమర్థవంతంగా నిర్వహించడంలో విశేష అనుభవం కియోలిస్ కంపెనీకి ఉంది. ఇప్పటి వరకు ఆ సంస్థ 2000 మంది ఉద్యోగులను వివిధ విభాగాల్లో నియమించుకొని శిక్షణనిచ్చి రైళ్లను నడపడంతో పాటు మెట్రో స్టేషన్‌ల నిర్వహణ, డిపోల్లో చేపట్టాల్సిన అన్ని రకాలను పనులను కియోలిస్ చేపడుతోంది.

## 3 చోట్ల మెట్రో మొదటి భూమి పూజ

- 2012 ఏప్రిల్ 21న చేసిన ఎల్ అండ్‌టీ

హైదరాబాద్ సిటీ, నవంబర్ 18 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ మహానగరంలో పరుగులు పెట్టడానికి సిద్ధమైన మెట్రోరైలు ప్రాజెక్టుకు మొట్ట మొదట మూడు చోట్ల భూమి పూజ నిర్వహించారు. 2012 ఏప్రిల్ 26న ఉప్పల్‌లోని ప్రీకాస్ట్ యార్డ్‌లో వయాడక్ట్‌ను రూపొందించేందుకు భూమి పూజను నిర్వహించారు. అదేవిధంగా ఉప్పల్ మెట్రో డిపోలో వర్క్‌షాపును, నాగోల్-ఉప్పల్ మెట్రో స్టేషన్‌ల మధ్య నిర్మించే పిల్లర్ల కోసం భూమి పూజలను ఒకే రోజు నిర్వహించారు. అలా 2012లో ప్రారంభమైన మెట్రో రైలు ప్రాజెక్టు పనులు 2015 మార్చి నాటికి పూర్తయి ప్రారంభానికి సిద్ధమైంది. అనివార్య కారణాల వల్ల మెట్రో రైలును ప్రారంభించేందుకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇవ్వలేదు. ప్రస్తుతం 30 కి.మీ మేర మెట్రో రైళ్లను నడిపేలా ఈనెల 28న ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ చేతుల మీదుగా ప్రారంభించేందుకు చకచకా ఏర్పాట్లు చేస్తున్నారు.